ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 29 జనవరి 2024





శ్రీకాకుళం కమిషనర్ తమీమ్ అన్సారియా



కలెక్టర్ మంజీర్ జిలానీ సమాన్

సంచార జాతులకు ఆదరణ ఏదీ?

- దిశ, దశ లేనీ ఎంబీసీ కార్పొరేషన్
- స్వయం ఉపాధి లేక అవస్థలు
- వలసలే శరణ్యం



● మెళియాపుట్టి మండలం జంతూరు గ్రామానికి చెందిన **ఎస్.శేషగిరి** కుటుంబం గతంలో గ్రామాలు తిరుగుతూ తోలుబొమ్మ లాట ఆడిస్తూ జీవనం సాగించేవారు. ఇప్పుడు కులవృత్తులకు ఆదరణ లేకపోవడంతో బతుకుతెరువుకోసం అవస్థలు పడుతున్నారు. భార్య దమయంతి మానసిక దివ్యాంగురాలు. అయినా పింఛన్ మంజూరు కాలేదు. ప్రస్తుతం శేషగిరి కుటుంబం గ్రామ శివారులోని ఒక పాడుబడిన భవనంలో తలదాచుకుంటోంది.



● మెళియాపుట్టి మండలం మురిఖిండిభద్ర గ్రామానికి చెందిన **బాడా వెంకయ్య** కుటుంబం తరతరాల నుంచి గంగిరెద్దులను ఆడిస్తూ జీవనం సాగించేవారు. ప్రస్తుతం గంగిరెద్దులకు ఆదరణ తగ్గడం, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోవడంతో వెంకయ్య పిల్లలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు.

● వైసీపీ ప్రభుత్వం సంచార జాతుల కుటుంబాలను నిర్లక్ష్యం చేస్తోంది. ఆ కుటుంబాల అభివృద్ధిని కనీసం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ పథకాలు, గుర్తింపు కార్డులు మంజూరు చేయడం లేదు. దీంతో వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. బతుకుతెరువు కోసం అవస్థలు పడుతున్నారు. ప్రచారం కోసమే ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు తప్ప దానివల్ల సంచార జాతులకు ప్రయోజనం చేకూరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం సంచార జాతుల అభి వృద్ధికి కృషి చేసింది. ఒక్కో సంచార కుటుంబానికి రూ.30వేల వరకు ఆర్థికసాయం అందించేది. కానీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వీరిని నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో బతుకుతెరువు కోసం కొందరు భిక్షాటన చేయాల్సి వస్తోంది.

(మెళియాపుట్టి)

జిల్లాలో సంచార జాతుల కుటుంబాలు 54 వేలు వరకు ఉన్నాయి. బాలసంతు, బహురూపి, బండార, బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెద్దులు, జంగం, జోగి, కాటికాపాల, కోర్చ, మెండివారు, బండ, మెండిబండ, పిచ్చిగుండ్లు, వంశీరాజ్, పాములు పట్టేవారు, పార్ధి, పంబల, దమ్మళి, వీరముష్టి, నెట్టికోటల, వారభంద్రేయ, గూడల, కంజార, భట్టా, కోప్మారే, రాజన్న, ముగ్గల, యాట, చోపేమారి కులాలు అత్యంత వెనుబడినవి. గంగిరెద్దులు, బుడబుక్కలు, జంగం, తోలుబొమ్మలు, తదితర కుల వృత్తులకు ఆదరణ లేకపోయినా ఇప్పటికీ ఊరూరా తిరుగుతూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని కులాల వారు వీధుల్లో బొమ్మలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. మరికొందరు యాచక వృత్తిలో ఉన్నారు. భార తీయ సంప్రదాయాల, ఆచారాలకు ప్రతిరూపమైన గ్రామీణ కళలు, ఇతిహాసాలు రామాయణం, మహభారతం, తదితర వాటిని బుర్రకథలు, కులగోత్రాలు, దొమ్మర విన్యాసాలు, గంగిరెద్దుల ఆటలు, బుడబుక్కల హితపలుకులు, తోలుబొమ్మలాటల ద్వారా కొన్ని సంచార జాతులు ప్రజలకు చేరువచేస్తున్నాయి. బీసీ-ఏ కేటగిరీకి చెందిన సంచార కులాలు సామాజిక, విద్య ఆర్థిక, రాజకీయ తదితర రంగాల్లో ఎంతో వెనుకబడి ఉన్నాయి. అన్ని కులాలకు గుర్తింపు ఈ సంచార జాతుల కుటుంబాలకు మాత్రం గుర్తింపు ఉండడం లేదు. ప్రస్తుతం కులగణన జరుగుతున్నా వీరు లెక్కలోకి రానిపరిస్థితి కనిపిస్తుంది. 2016లో మొత్తం 32 కులాలను అత్యంత వెనుకబడిన కులాలుగా గుర్తించారు. షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించేవారు. వీరు వ్యాపారం చేసుకునేందుకు టీడీపీ ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సాయం చేసింది. అలాగే రుణాలు కూడా మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వీరిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా ఈ ఏడాది 14,493 మంది ఖాతాల్లో రూ.27.17 కోట్లు జమచేసినట్లు లెక్కలు చూపిస్తున్నా తమకు మాత్రం అందలేదని సంచార జాతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమపై కరుణ చూపాలని వేడుకుంటున్నారు.

కులవృత్తుల వారికి రుణాలు లేవు...

ప్రస్తుతం షెడ్యూల్డ్ కులాల వారికి రుణాలు వంటివి ఏమీ లేవు. కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు వస్తే కార్పొరేషన్‌కు పంపిస్తాం. గ్రామాల్లో శాశ్వత నివాసం ఉన్నవారికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉంటే కులగణన సర్వే చేసి వివరాలు నమోదు చేస్తాం.

-చంద్రకుమారి, ఎంపీడీవో, మెళియాపుట్టి



సంచారజాతులు నివసించే మురిఖిండిభద్ర గ్రామం

కలెక్టర్‌గా మంజీర్ జిలానీ సమాన్

- జిల్లాలో బదిలీల సందడి
- మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి.. శ్రీకేష్ బి.లఠ్కర్
- శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా తమీమ్ అన్సారియా



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాకు కొత్త కలెక్టర్ వస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సీజన్ సమీపిస్తున్న వేళ.. బదిలీల సందడి మొదలైంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 21మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాకు కొత్త కలెక్టర్‌గా మంజీర్ జిలానీ సమాన్‌ను నియమించింది. ప్రస్తుత కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్‌ను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి డైరెక్టర్‌గా బదిలీ చేసింది. మంజీర్ జిలానీ సమాన్.. 2012 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం నంద్యాల జిల్లా కలెక్టర్‌గా వ్యవహరిస్తూ బదిలీపై ఇక్కడ రానున్నారు. ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

● శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బదిలీ అయ్యారు. ఈయనను ఎక్కడకు బదిలీ చేశారన్నదీ ప్రస్తుతం వెల్లడికాలేదు. ఆయన స్థానంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో విధులు నిర్వహిస్తూ వెయిటింగ్‌లో ఉన్న ఐఏఎస్ అధికారిణి తమీమ్ అన్సారియాను నియమించారు. ఈమె 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. జిల్లాకు కొత్త కలెక్టర్‌గా రానున్న మంజీర్ జిలానీ సమాన్ సతీమణి కూడా. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్‌గా కూడా వ్యవహరించారు. స్పౌజ్ కోటా కింద జిల్లాకు కమిషనర్‌గా రానున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లో ఐఏఎస్ అధికారిణి శోభ శ్రీకాకుళం నగరపాలక సంస్థకు కమిషనర్‌గా ఉండేవారు. ఆమె బదిలీ అయిన తర్వాత ఐఏఎస్ అధికారులను నియమించలేదు. ఎనిమిదేళ్ల తర్వాత కార్పొరేషన్‌కు ఐఏఎస్ అధికారిని నియమించారు.

● **ఇప్పటికే పలు శాఖల్లో కదలికలు**

ఇప్పటికే పలు శాఖల్లో అధికారులు బదిలీ అయ్యారు. శ్రీకాకుళం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రేమప్రసన్నవాణిని రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌కు అదనపు కమిషనర్‌గా బదిలీ చేసింది. అలాగే జిల్లాపరిషత్ పరిధిలో 21 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు బదిలీలు అయ్యాయి. విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి ఇక్కడకు.. ఇక్కడ నుంచి ఆ జిల్లాలకు ఎంపీడీవోలు బదిలీలు అయ్యారు. కొద్దిరోజుల వ్యవధిలో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, జిల్లాలో ఇతర శాఖలు, పోలీసుల్లో బదిలీలు జరిగే అవకాశముంది.

ఓటర్ల జాబితాలో తొలగని 'ఆత్మలు'

సరుబుజ్జిలి, జనవరి 28: ఓటర్ల జాబితాలో తప్పుల తడకలు కొనసాగుతూనే ఉన్నాయి. ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు తొలగించాలని ఇటీవల కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినా.. సరుబుజ్జిలి మండలానికి చెందిన ఓటర్ల జాబితాలో ఇంకా మృతుల పేర్లు ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీలకు చెందిన పోలింగ్ కేంద్రాల ఏజెంట్లు, కన్వీనర్లు ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల తుదిజాబితాలో లోపాలు ఉన్నాయనంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సరుబుజ్జిలి మండలం మర్రిపాడుకు చెందిన కందుకూరి రంగనాయకమ్మ కొన్నాళ్ల కిందట మృతి చెందింది. ముసాయిదా జాబితా ప్రకారం 185వ పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు ఉంది. దానిని తొలగించాలని కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసినా.. తుది జాబితాలో ఆమె ఓటరుగానే ఉన్నారు. అలాగే చిగురువలసలోని 186వ పోలింగ్ కేంద్రం పరిధిలో బురక భూలోకమ్మ, చల్ల రామన్న మరో ఇద్దరు ఓటర్లు కొన్నాళ్ల కిందట మరణించినా.. వారిపేర్లు తుది ఓటర్ల జాబితాలో కొనసాగుతూనే ఉన్నాయి. ఇదే పోలింగ్ కేంద్రం పరిధిలో బూర్జ మండలం అన్నంపేట, సరుబుజ్జిలి మండలం నందికొండకు చెందిన కొంతమంది ఓటర్లు ఉన్నారు. వారు చిగురువలసలోని 186 కేంద్రంలో ఓట్లు తొలగించాలని దరఖాస్తు చేసినా తుదిజాబితాలో కొనసాగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

గ్రానైట్‌కు గడ్డుకాలం

- ముఖం చాటేసిన విదేశీ బయ్యర్లు
- గ్రానైట్, మోర్నమెంట్ మెటీరియల్ చెల్లక ఇబ్బందులు
- వెలవెలబోతున్న క్వారీలు



(టెక్కలి)

జిల్లాలో వేలాది మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధినిచ్చే గ్రానైట్ పరిశ్రమ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. నీలిరంగు గ్రానైట్ అంటే ఒకప్పుడు విదేశీయులకు చాలా మక్కువ. మోర్నమెంట్(స్మారకం) మెటీరియల్ కింద యూరప్ దేశీయులు ఎక్కువగా కొనుగోలు చేసేవారు. నేడు రష్యా, ఉక్రేయిన్ వార్, నల్ల సముద్రంపై షిప్పులు రవాణా తగ్గడం, ఆర్థిక మాంద్యం ప్రభావం వెరసి ఇటలీ, అమెరికా, జర్మన్, తైవాన్, పోలెండ్, ఫ్రాన్స్ తదితర దేశాల నుంచి విదేశీ బయ్యర్లు గ్రానైట్ మోర్నమెంట్ బ్లాకులు కొనుగోలుకు రాకపోవడంతో క్వారీ యజమానులు తలలు పట్టుకుంటున్నారు. క్వారీల నిర్వహణకు పెరిగిన ఖర్చులు, రాష్ట్ర ప్రభుత్వం సీనరీస్ చార్జీలు పెంచడం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద క్యూబిక్ మీటర్‌కు 50శాతం పెంచడం, లోకల్ ఫ్యాక్టరీలకు ఇచ్చే రాయితీలు ఎత్తివేయడం తదితర కారణాలతో క్వారీల్లో గ్యాంగ్‌సైజ్ బ్లాకులు కుప్పలుతెప్పలుగా పడి ఉంటున్నాయి. యూరప్ దేశాలు ఎలాగూ ముఖం చాటేశాయి. మార్కెట్ నెమ్మదించడంతో ఆసియా పరిధి చైనా బయ్యర్లు కూడా రాక గ్రానైట్ క్వారీలు వెలవెలబోతున్నాయి.

తెలంగాణ, ఒడిశా వైపు చూపు

నీలిరంగు గ్రానైట్ పరిశ్రమకు రాయితీలు లేక.. క్వారీల నిర్వహణకు తగిన వనరులు లేక.. గ్రానైట్ క్వారీలు తగ్గుముఖం పడుతున్నాయి. జిల్లాలో సుమారు 200వరకు కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. ఇందులో 50కు పైగా పరిశ్రమలు ఇటీవల తెలంగాణ, ఒడిశా ప్రాంతాల వైపు తరలిపోతున్నాయి. క్యూబిక్ మీటరు కట్టర్ సైజ్‌కు రూ.2,600 సీనరీస్ చార్జీలు, 50శాతం డీఎంఎఫ్, రెండుశాతం సెస్, రెండుశాతం ఐటీ, 12శాతం పన్నులు, రవాణా చార్జీలు తడిపిమోపెడు అవుతున్నాయి. దీంతో లోకల్ గ్రానైట్ ఫ్యాక్టరీలు సైతం మూడు షిఫ్టులు నిర్వహించే పరిస్థితి నుంచి ఒక షిఫ్ట్‌కు పరిమితమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రానైట్ ఫ్యాక్టరీలకు గతంలో ఇచ్చిన రాయితీలు రద్దుచేయడం, విద్యుత్ చార్జీల భారం పెరగడంతో లోకల్ ఫ్యాక్టరీలు మూసివేసి ఒడిశా, తెలంగాణ వైపు జారుకుంటున్నారు.

బస్సుల్లో భద్రత ఎంత?

- ఆర్టీసీకి డొక్కు వాహనాలే గతి
- ఎక్కడ ఆగిపోతాయో తెలియని వైనం
- తరచూ ప్రమాదాలతో ప్రయాణికులకు ఇబ్బందులు



● ఈ నెల 25న పలాస నుంచి టెక్కలి వస్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులో సుందరరావు అనే ప్రయాణికుడి తల కిటికీ అద్దాల మధ్య ఇరుక్కుంది. దాదాపు 15 నిమిషాల పాటు తోటి ప్రయాణికులు ప్రయత్నించినా తల బయటకు రాలేదు. దీంతో టెక్కలి పట్టణానికి వెళ్లగా స్థానికుల సాయంతో బలవంతంగా అద్దం రేకు వంచగా ఆయన తల బయటకు రావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

● గత ఏడాది అక్టోబరు 16న శ్రీకాకుళం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నందిగాం మండలం తురకలకోట వద్ద ప్రమాదానికి గురైంది. స్టీరింగ్ రాడ్డు విరిగి రోడ్డుపక్కనే ఉన్న గోతిలోకి బస్సు ఒరిగిపోయింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.





● గత ఏడాది జూన్ 5న నరసన్నపేట సమీపంలోని కోమర్తి జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు స్టీరింగ్ ఊడి.. అదుపు తప్పి బోల్తా పడింది. బస్సులో 19 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆ సమయంలో వెనుక ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

(రణస్థలం)

..ఇలా జిల్లాలో ఇటీవల ఆర్టీసీ బస్సుల్లో ప్రమాదాలు పెరుగుతున్నాయి. తరచూ బస్సులు మొరాయిస్తున్నాయి. కాలం చెల్లిన బస్సులు అటు సిబ్బందికి, ఇటు ప్రయాణికులకు రోత పుట్టిస్తున్నాయి. కొత్తగా డిపోలకు చేరిన అల్ట్రాడీలక్సులు, సూపర్ లగ్జరీ బస్సులు సైతం మొరాయిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇక పల్లెవెలుగులు గురించి చెప్పనక్కర్లేదు. సక్రమంగా పనిచేయని స్టీరింగ్‌లు, పగిలిన అద్దాలు, విరిగిననట్లు రణగొల ధ్వనులతోనే బస్సులను నడుపుతుండడంతో.. ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకమవుతోంది. జిల్లా పరిధిలో శ్రీకాకుళం 1,2 డిపోలు, పలాస, టెక్కలిలో డిపోల పరిధిలో 318 బస్సులు ఉన్నాయి. పల్లెవెలుగు సర్వీసులన్నీ కాలం చెల్లినవే. వాస్తవానికి 13లక్షల కిలోమీటర్లు దాటిన బస్సులను కాలం చెల్లినవిగా పరిగణిస్తారు. కానీ ఇప్పుడు పల్లె వెలుగు సర్వీసులకు తిప్పుతున్న బస్సులన్నీ 13 లక్షల కిలోమీటర్లు ఎప్పుడో దాటిపోయినట్టు తెలుస్తోంది. తొలుత సూపర్ ఎక్స్‌ప్రెస్‌లుగా ఉండే బస్సులు ఐదు లక్షల కిలోమీటర్లు దాటిన తరువాత పల్లె వెలుగులుగా వినియోగిస్తారు. ఎక్స్‌ప్రెస్‌లుగా కొత్త బస్సులను కొనుగోలు చేస్తారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త బస్సుల కొనుగోలు సక్రమంగా జరగడం లేదు.

● **డిపోల్లో మెకానిక్‌ల కొరత**

జిల్లాలో 60 వరకూ డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని డిపోల్లోనూ మెకానిక్‌ల కొరత ఉంది. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయడం లేదు. 40 శాతం కాంట్రాక్ట్ సిబ్బందితోనే నడిపిస్తున్నట్టు ఆర్టీసీ యూనియన్ నేతలు చెబుతున్నారు. డిపోల్లో నిపుణులైన మెకానిక్‌లు లేకపోవడం, విడి పరికరాలు సక్రమంగా సరఫరా కాకపోవడంతో బస్సుల మరమ్మతులు జరగడం లేదు. బస్సు డిపోల్లోకి చేరుకున్న తరువాత లోపాలను లాగ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. వాటిని రాత్రికి మెకానిక్ లు సరిచేస్తారు. కానీ సిబ్బంది లేకపోవడంతో ఈ విధానం సక్రమంగా అమలుకావడం లేదు. అది బస్సుల కండీషన్‌పై ప్రభావం చూపుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీలో కొత్త నియామకాలు లేవు. అడపాదడపా అప్రంటీస్ మేళాలో కొద్దిమందిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించి చేతులు దులుపుకొంటున్నారు. ఒక్కొబస్సుకు డ్రైవర్, కండక్టర్, గ్యారేజీ మెకానిక్, సహాయకుడు కలుపుకొని ఐదుగురు సిబ్బంది ఉండాలి. కానీ బస్సుల నిష్పత్తి చూసుకుంటే ఇద్దరు కూడా ఉండని పరిస్థితి. మొత్తం 4 డిపోల్లో 370 మంది మంది వరకూ పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. సిబ్బంది కొరత కారణంగా ఉన్న వారిపై భారం పడు తోంది. 8 గంటలపాటు డ్యూటీ చేయాల్సి ఉండగా 12గంటలకు మించి చేయాల్సి వస్తోంది. పనిఒత్తిడితో సిబ్బంది అనారోగ్యానికి గురై ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఇబ్బందులను అధిగమిస్తున్నాం..

ప్రజారవాణే ఆర్టీసీ ధ్యేయం. ఇబ్బందులను అధిగమించి ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నాం. సిబ్బంది కొరత లేదు. ఇటీవల కొత్త రూట్లలో బస్సులు సైతం నడుపుతున్నాం. జిల్లాలో ప్రతి పట్టణానికి, మండల కేంద్రాన్ని కలిపేలా.. అన్ని రూట్లకు ప్రాధాన్యమిస్తున్నాం. బస్సుల కండీషన్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

-రమేష్, ప్రజారవాణా అధికారి, శ్రీకాకుళం

మంత్రి సభకు ఆదరణ కరువు



మంత్రి సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

శ్రీకాకుళం క్రైం, జనవరి 28: శ్రీకాకుళం మండలం ఒప్పంగిలో ఆదివారం రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆసరా కార్యక్రమానికి ఆదరణ కరువైంది. రూ.66లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌తో పాటు రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. అనంతరం ఆసరా నాల్గోవ విడత నిధులు విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మహిళా సంఘాల ప్రతినిధులు మహిళలను తరలించే ప్రయత్నం చేశారు. గంట ఆలస్యంగా ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైంది. కొంతమంది మహిళలు అప్పటికే విసిగివెళ్లిపోయారు. ఈ క్రమంలో ప్రసంగం ప్రారంభించిన సమయంలో చాలా కుర్చీలు ఖాళీగా కనిపించడంతో మంత్రి ధర్మాన ప్రసాదరావు అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్ సైతం సభలో మాట్లాడుతూ 1200 మందితో ఏర్పాటు చేసిన సమావేశానికి మహిళలు హాజరుకాకపోవడం సరికాదని అసంతృప్తిని వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

- విద్యుత్తు కొనుగోళ్లు, చార్జీలపై విశాఖ వేదికగా విచారణ
- వర్చువల్ విధానంలో అభిప్రాయాలు తెలపనున్న 71 మంది
- నాలుగు రోజులపాటు కార్యక్రమం

విశాఖపట్నం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత చార్జీల పెంపు, విద్యుత్ కొనుగోళ్లపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వర్చువల్ విధానంలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మేరకు ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు ఏపీఈఆర్‌సీ అధికారులతోపాటు ఏపీ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) విధానంలో స్వీకరించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల చార్జీల ప్రతిపాదనలపై 63మంది, ఏపీ జెన్‌కో ప్రతిపాదనలపై ఎనిమిది మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియజేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17 మంది, మంగళవారం 23మంది, బుధవారం 23మంది, గురువారం ఎనిమిది మంది అభిప్రాయాలను తెలియజేయనున్నారు. ఏపీఈఆర్‌సీ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోని వారు కూడా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అభిప్రాయాలను తెలియజేయాలనుకుంటే సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్(ఎస్ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఏపీ ఈఆర్‌సీ అనుమతితో రోజూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి రెండుగంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

గ్రామ గ్రామాన 'బాబు ష్యూరిటీ'

టీడీపీ అధిష్ఠానం పిలుపు మేరకు గ్రామ గ్రామాన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వివిధ గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు టీడీపీ మేనిఫెస్టోపై అవగాహన కలిగించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : బగ్గు

నరసన్నపేట, జనవరి 28: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నరసన్న పేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలో కలివరపుపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యర్థులపై కేసులు పెట్టి వేధించడం మామూలైందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వైసీపీ అరాచక పాల నకు స్వస్తి చెప్పేందుకు రైతులు, యువత, మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ రాష్ట్రానికి అవసరం లేదన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో నేతలు శిమ్మ చంద్రశేఖర్, బెవర రాము, గొద్దు చిట్టిబాబు, కోరాడ రామచంద్రరావు, కింజరాపు రామారావు, తంగి తారకేశ్వర రావు, బోయన సతీష్, తాళాభక్తుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

● **కోటబొమ్మాళి:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుకు గ్యారెంటీ అని మాజీ సర్పంచ్ ఉప్పాడ జయరాం అన్నారు. ఆదివారం హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్న హరిశ్చంద్రపురంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం పూడిజగన్నాథపురం పంచాయతీ పూడిలంక గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేని ఫెస్టోపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిమ్మల కృష్ణారావు, శేషు, తిమ్మల గణపతి, అవల వెంకటేష్ ఉన్నారు.

● **మందస:** టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అన్నారు. ఆదివారం బెల్లుపటియా, హొన్నాళి, సిరిపురం పంచాయతీల్లో 'పల్లె పల్లెకు టీడీపీ' నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాస్కరరావు, జయరాజ్, రాజాన మహేష్, మెట్ట మహేష్, ఎం.చంద్రశేఖర్, టి.వేణుగోపాల్, ఉమాపతి, శ్యామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలో చేరారు.


నరసన్నపేట: 'బాబు ష్యూరిటీ'లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బగ్గు రమణమూర్తి


కోటబొమ్మాళి: భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రమాణ పత్రాలను అందజేస్తున్న ఉప్పాడ జయరాం

టీడీపీ విజయానికి సహకరించండి

తలసముద్రం(పోలాకి): ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ శిష్టకరణాల కమిటీ కన్వీనర్ అక్కు మహంతి రాజా అన్నారు. ఆదివారం సంఘ ప్రతినిధులతో కలిసి తలసముద్రం, అంపలాం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీ విజయావశ్యకతను వివరించారు. టీడీపీ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రతినిధి సదాశివుని రాంబాబు, విశాఖపట్నం పార్లమెంట్ కన్వీనర్ బలివాడ సత్యారావు, డబ్బీరు రఘు, బలివాడ కృష్ణారావు, చంద్రమహంతి గోవింద, కుప్పిలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం రూరల్:** భవిష్యత్ తరాలు బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నాయకులు దక్కత కామేశ్వరరావు అన్నారు. ఆదివారం కేశుపురంలో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జి.భీమరాజు, పి.పురుషోత్తం, నరేంద్ర, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి

మెళియాపుట్టి: టీడీపీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రతి గడపకు చేరువ చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ అన్నారు. ఆదివారం మెళియాపుట్టిల్లో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ చేస్తున్న అరాచకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. టీడీపీ ప్రతి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, పరమేష్‌రెడ్డి, పైడి రాజ్, కోదండరావు, శ్రీను, భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

● **పాతపట్నం:** వైసీపీ పాలనలో నిరంకుశ ధోరణి ఎక్కువైందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తిలోద కాలు తప్పవని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ అన్నారు. ఓ కల్యాణ మండపంలో క్లస్టర్, యూనిట్, యూత్ ఇన్‌చార్జిలకు శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎన్నికల సమరానికి సం సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పైల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కొత్తూరు:** టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ కత్తిరి వెంకటరమణ అన్నారు. కొత్తూరు లోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

● **హిరమండలం:** టీడీపీ ఎన్నికల ప్రణాళికలో ఆరు సంక్షేమ పథకాలపై బూత్ కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించాలని పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ కత్తిరి వెంకట రమణ అన్నారు. ఆదివారం హిరమండలంలో ఇంటి గ్రైటెడ్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనువాసరావు, టీడీపీ నాయకులు కె.సింహాచలం, బర్రి సురేష్, లంక రోజారాణి, దారపు డిల్లేశ్వరరావు, దంత తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కత్తిరి వెంకటరమణ

పల్లెపల్లెకు టీడీపీని విజయవంతం చేయండి

వజ్రపుకొత్తూరు: మండలంలో సోమవారం నుంచి చేపడుతున్న పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహన రావు కోరారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, కణితి సురేష్, బి.శశిభూషణ్, అంబటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు: పూడిలంకలో బాబుష్యూరిటీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


మందస: బెల్లుపటియాలో పల్లెపల్లెకు టీడీపీపై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు


పోలాకి: టీడీపీ మేనిఫెస్టో కరపత్రాన్ని అందజేస్తున్న శిష్టకరణాల సంఘ నాయకులు


ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీముఖలింగం ఎస్సీ కాలనీకి రూ.8 లక్షల ఎంపీ నిధులు

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎంపీ నిధులు రూ.8 లక్షలు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టనున్నారన్నారు. ఇదిలా ఉండగా శ్రీకాకుళం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దరెల్లి వీధిలో ఉన్న మాజీ సైనికుల కమ్యూనిటీ భవనం మరమ్మతులకు రూ.5 లక్షలు, గార మండలం బోరవానిపేట, కోటబొమ్మాళి మండలం చిట్టివలస గ్రామాల్లో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటుకు రూ.4.75 లక్షలు, కోటబొమ్మాళి మండలం సౌడాంలో విద్యుత్ స్తంభాలు వేసేందుకు రూ.3.55 లక్షలు కేటాయించారు. ఈ మేరకు కలెక్టర్‌కు రికమండ్ చేసినట్లు శ్రీకాకుళంలోని ఎంపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నేడు కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల మహా ధర్నా

పలాసరూరల్: సమస్యల సాధన కోసం సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నామని ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యవర్గసభ్యులు ఆర్.రామచంద్రరాజు, కుమార్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ పీఆర్సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను పదో పీఆర్సీలో ఇచ్చిన విధంగానే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదల, పెన్షనర్లకు ఆసుపత్రి సౌకర్యం తదితర సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. పెన్షనర్లంతా హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నేత

కొత్తూరు: ఏపీటీఎఫ సబ్ కమిటీ సమావేశం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. జిల్లా నాయకుడు శాంతారావు మాట్లాడుతూ.. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి యు.బాలకృష్ణ, నాయకులు వై.సత్యనారాయణ, ఎల్.గోవర్ధన రావు, కె.రాజారావు, జి.సీతారాం, ఎం.లోకేష్, వి.చంద్రమౌళిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

డోల (పోలాకి): డోల గ్రామంలో ఆదివారం ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కలిగించారు. డీటీ పొదిలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ఈవీఎంపై మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. నిరక్షరాస్య ఓటర్లలో యువత మరింత చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, వీఆర్వో రమణమూర్తి, మాజీ సర్పంచ్ డోల ఉదయభాస్కర్, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.


ఈవీఎంలపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

శ్రీరాములు జీవితం ఉద్యమానికి ఆదర్శం

వజ్రపుకొత్తూరు: సీపీఎం నాయకుడు బమ్మిడి శ్రీరాములు జీవితం ఉద్యమానికి ఆదర్శమని న్యాయవాది కొండవూరు వీరయ్య అన్నారు. ఆదివారం నగరంపల్లిలో శ్రీరాములు జీవిత విశేషాల ఆధారంగా మామిడి కోదండరావు రచించిన 'గిరిజనోద్యమం ప్రతిబింబం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.మధుకేశరావు, మాజీ సర్పంచ్‌లు దువ్వాడ వెంకట కుమార్ చౌదరి, జయరాం చౌదరి, బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా రగ్బీ జట్ల ఎంపిక

టెక్కలి: విశాఖ జిల్లా భీమిలిలో ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జరగనున్న అండర్-14 సబ్ జూని యర్స్ బాల బాలికల రాష్ట్రస్థాయి పోటీలకు జట్లను ఆదివారం ఎంపిక చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రగ్బీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాడాన నారాయణరావు ఆధ ర్యంలో ఈ ఎంపికల ప్రక్రియ చేపట్టారు. ఎంపికైన క్రీడాకారులకు రవాణా ఖర్చులను కోశాధి కారి డొంకాన రామకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో కేకే రామిరెడ్డి, రఘునాథరావు, జగదీష్, నాగరాజు, శైలజ, పూర్ణచంద్రరావు, నర్మద, రమేష్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన రగ్బీ క్రీడాకారులు

ఒకటి నుంచి లింబుగాంలో కబడ్డీ పోటీలు

మందస: లింబుగాం గ్రామంలో ఫిబ్రవరి ఒకటి నుంచి 3 వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు లింబుగాం గ్రామ కబడ్డీ నిర్వాహకులు తెలిపారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగు పోటీలకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు 75694 69540, 97049 51637, 87905 79391 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జగన్‌రెడ్డికి భయమంటే ఏంటో చూపించాం

● విద్యావ్యవస్థలో రాష్ట్రానికి ఆఖరిస్థానం
● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి భయం అంటే ఏమిటో చూపించామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల 'సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో, ఓ చానల్‌లో ప్రసారమైన పెయిడ్ కార్యక్రమంలో జగన్‌రెడ్డి మొహంలో భయం స్పష్టమైందన్నారు. కొద్దినెలల కిందట ఇదే విషయం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా చెప్పారని.. ఆ భయం ఇప్పుడు జగన్‌రెడ్డిలో కనిపిస్తోందన్నారు. ఆ చానల్‌లో ఏపీలో విద్యాబోధన గురించి మాట్లాడకుండా సీఎం పనికి మాలిన ప్రసంగాలు చేశారంటూ విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన విద్యలో 2018 సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు. ఇప్పుడు ఆఖరి స్థానంలో ఉందన్నారు. ఇదీ జగన్ రెడ్డి ప్రగతి అంటూ దుయ్యబట్టారు. కాన్సెప్ట్ స్కూల్స్ పేరుతో హైస్కూల్స్ లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టామని, కేజీబీవీ ల్లోనూ ఇంటర్ విద్యను ప్రవేశపెట్టామని చెప్పారు. ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌లో విద్యావ్యవస్థ గురించి చంద్రబాబో, పవన్ కల్యాణో చెప్పడం లేదని.. కేంద్రం విడుదల చేసిన నివేదికలతో బట్ట బయలైందని వివరించారు. కనీసం ఎనిమిదో తరగతి విద్యార్థి రెండో తరగతి లెక్కలు చేయలేక పోతున్నాడని సర్వేలో వెల్లడైందని.. ఇదీ ఏపీ దుస్థితి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు రమణ మాదిగ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు రవికుమార్

అసంపూర్తి రోడ్లతో అవస్థలు


సున్నాదేవి గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

పలాసరూరల్: మండలంలో పలు గ్రామాలకు రోడ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఆయా గ్రామా ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి నుంచి సున్నాదేవి గ్రామానికి, సున్నాదేవీ మీదుగా రంగోయి, సవరగోవిందపురం రోడ్డులో మహదేవపురం గ్రామానికి కచ్చా రోడ్లు వేశారు. మిగిలిన పనులు నిలిపివేశారు. దీంతో రోడ్లన్నీ ఛిద్రంగా తయారయ్యాయి. గోతుల్లో వేసిన క్రషర్ బుగ్గి కదిలిపోయి రాళ్లు తేలడంతో దారుణంగా తయారయ్యాయి. సవరగోవిందపురం రోడ్డు నుంచి కొరారింగి తాళభద్ర వరకు సుమారు 5 కిలోమీటర్ల రోడ్డు ఆర్భాటంగా ప్రారంభించినా పనులు సగంలోనే నిలిపివేశారు. దీంతో బాపనూరు, రఘునాథపురం, కొరారింగితాళభద్ర గ్రామాలకు వెళ్లేందుకు గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


సవరగోవిందపురం నుంచి కొరారింగి తాళభద్ర వరకు సగంలో నిలిచిన రోడ్డు

గోతులను పూడ్చరూ..

పాతపట్నం: పాతపట్నం-తెంబూరు బీటీ రోడ్డు గోతులమయమై వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా యథాప్రకారం గోతులుగా తయారైంది. దీంతో ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


తెంబూరు రైల్వే స్టేషన్ వద్ద గోతులమయమైన బీటీ రోడ్

రోడ్డు పక్కన చెత్తతో దుర్గంధం


రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

జలుమూరు: చల్లవానిపేట సమీపంలో గుంజుమెట్ట వద్ద రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకు పోవ డంతో పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టిఫిన్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పలు వ్యాపార కేంద్రాల నుంచి వచ్చే చెత్తను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు దుర్గంధంతో ఇక్కట్లకు గురవుతున్నారు. చెత్త సంపద కేంద్రాలకు చెత్తను తరలించాల్సి ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సా...గుతున్న భూ సర్వే

పలాసరూరల్: వైసీపీ ప్రభుత్వం 'శాశ్వత హక్కు భూరక్ష' పేరుతో 2021లో భూ సర్వేని ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదు. పలాస మండలంలో సుమారు 79 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటి వరకు 44 గ్రామాల్లోనే భూసర్వే చేపట్టారు. ఎక్కడెక్కడ సర్వే పూర్తి చేశారో అక్కడ పొలాలు, భూముల్లో జగనన్న భూహక్కు పేరుతో రాళ్లను పాతినప్పటికీ పూర్తి స్థాయిలో మండలంలో సర్వే చేపట్టలేదు. చేపట్టిన గ్రామాల్లోనూ భూ యజమానులకు సమా చారం అందించకపోవడం, వివాదం ఉన్న చోట సర్వే పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం వంటి సమస్యలతో సర్వేపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బొడ్డపాడు, మామిడిపల్లి గ్రామాల్లో ఇటీవల భూసర్వే జరిగిన సమయంలో వివాదాలు రేగడం, దీని వెనుక సచివాలయం సర్వే యర్ ఉండడం, భూములు, సరిహద్దులపై సరైన అవగాహన లేకపోవడంతో వివాదాలు మరింత పెరుగుతున్నాయి. ఎక్కడైతే వివాదాలు రేగుతున్నాయో ఆ ప్రాంతంలో మరలా రీ సర్వే చేపట్టేందుకు గ్రామస్థులను పిలిచి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా సరైన ఫలితాలి వ్వడం లేదనే వాదన వినిపిస్తోంది.


సవరగోవిందపురంలో ఉన్న సర్వే రాళ్లు (ఫైల్)

అడంగళ్లు, 1బిలో తప్పుల తడక

గతంలో ఇచ్చిన భూములకు సంబంధించి 1బి, అడంగళ్లలో తప్పుడు సమాచారం ఇవ్వడం, పేర్లు మార్పిడి జరగడం, సరైన విధంగా సర్వే నెంబర్లు లేకపోవడం వివాదాలకు తావిస్తోంది. ఈ విషయంలో అధికారులు తప్పిదాలు చేస్తుండడంతో రైతులు, నిరక్షరాస్యులు వాటిని సరిదిద్దుకోవడానికి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. ముఖ్యంగా సర్వేయర్ కార్యాలయంలో అందుబాటులో లేక పోవడంతో తీవ్ర నిరాశతో లబ్ధిదారులు వెనుదిరుగుతున్నారు. భూ సర్వే పేరుతో కాలయాపన చేయకుండా సరైన రీతిలో సర్వేను పూర్తి చేసి ప్రతీ లబ్ధిదారుడికి న్యాయం చేయాల్సి ఉండగా ఆ దిశగా పనులు జరగకుండా నత్తనడకన సాగుతుండడంతో భూ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ ఎల్.మధుసూదనరావును వివరణ కోరగా మండలంలో సర్వేను త్వరితగతిన చేపడు తున్నామని, ఇప్పటి వరకు 48 గ్రామాలకు పైగా సర్వే చేయడం జరిగిందని, మిగతా గ్రామాల్లో సర్వే పూర్తి చేస్తామన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి

కాశీబుగ/పలాస: సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం కాశీబుగ్గ సంత మైదానం, పలాస ప్రభుత్వ కళాశాల మైదానంలో మహిళా సంఘాలకు 4వ విడత ఆసరా పంపిణీ చేపట్టారు. ముఖ్య మంత్రి ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని, నేడు రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● **నందిగాం:** మహిళల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. ఆదివారం నంది గాం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆసరా నాలుగో విడత పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీ పేరాడ భార్గవి, పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏం అభివృద్ధి చేశారని జగన్‌రెడ్డికి ఓటేయాలి?

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష
- వైసీపీ నుంచి 120 మంది టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ నేతలు, కార్యకర్తలతో గౌతు శిరీష

పలాస, జనవరి 28: రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేశారని సీఎం జగన్‌కు ఓటెయ్యాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ప్రశ్నించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల శంఖారావం సభ నిర్వహించిన జగన్మోహన్‌రెడ్డి ఏసు శిలువ ఆకారంలో వేసిన వేదికపై క్యాట్ వ్యాక్ చేసి ప్రజలకు అబద్ధాలు చెప్పారన్నారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, సీపీఎస్ రద్దు నుంచి మూడు రాజధానుల వరకు రాష్ట్రాన్ని దేశంలో కింది స్థానానికి దించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి పేదలకు అన్నంపెట్టే అన్నక్యాంటీన్ల వరకు ధ్వంసం చేసి నందుకా ఓటు వేయాలని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు, మునిసిపల్ పారి శుధ్య కార్మికులు, రాజధాని కోసం పోరాటం చేస్తున్న రైతులపై దాష్టికాన్ని ప్రదర్శించారని, ప్రశ్నించే సొంత పార్టీ వారిని సైతం జైలులో పెట్టిన చరిత్ర సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సొంత ఇంటిలో తల్లిని, చెల్లిని చూడకుండా రోడ్డుకు ఈడ్చిన జగన్ ప్రజల బాగోగులు ఏవిధంగా చూస్తారన్నారు. తన నాయకుడు లోకేష్ యువగళం పాదయాత్రకు బస్సులు అద్దెకు కావాలని దరఖాస్తు చేస్తే ఆర్టీసీ అధికారులు నిరాకరిం చారని, సీఎం సభకు మాత్రం జిల్లా నుంచి వందలాది బస్సులిచ్చి అధికార దుర్విని యోగానికి పాల్ప డ్డారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే భరతం పడతారని, టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావడం ఖాయమన్నారు.

సూదికొండవార్డు వైసీపీ ఖాళీ

పట్టణంలోని 19వ వార్డు సూదికొండకాలనీకి చెందిన 120 వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారంతా పెద్ద ఎత్తున ర్యాలీగా టీడీపీ కార్యాలయానికి రాగా శిరీష వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ.. గత సార్వత్రిక, మునిసిపల్ ఎన్నికల్లో వైసీపీకి ఓటువేసి పెద్ద తప్పు చేశామన్నారు. సూదికొండ, నెమలికొండలు మొత్తం అక్కడి వైసీపీ నాయకులు ఆక్రమించి కొండ స్వరూపాన్ని మార్చారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే కొండ ఆక్రమణలు తొలగించి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. టీడీపీలో చేరిన వారిలో జోగ తిరు పతిరావు, వీరభద్రరావు, దశరథరావు, చిరంజీవితోపాటు ఆ కాలనీవాసులున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్య నారా యణ, టంకాల రవి శంకర్ గుప్తా, అంబటి కృష్ణమూర్తి, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎ.రామకృష్ణ, సత్యం, మల్లా శ్రీనివాసరావు, సైన వల్లభరావు, సవర రాంబాబు పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనే బాబు లక్ష్యం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్
- 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక



కృష్ణాపురంలో టీడీపీలో చేరిన కార్యకర్తలతో రవికుమార్

ఆమదాలవలస: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించి ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే టీడీపీ అధినేత చంద్రబాబు లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆమదాలవలస మునిసిపాలిటీలోని రెండో వార్డు కృష్ణాపురంలో పేడాడ వెంకటరమణ, సనపల రామ్మూర్తి, పైడి లిఖిత మెట్ట జానకి, సనపల సన్యాసిరావు, సనపల ప్రసాదరావు, పైడి ప్రవీణ్ కుమార్, చింతలపూడి ఆదినారాయణలతోపాటు వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసీపీ పతనం ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలో చేరికలతో మొదలైందన్నారు.సైనికుల్లా పని చేసేటీడీపీ కార్యకర్తలు రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూన అప్పలనాయుడు, తమ్మినేని విద్యాసాగర్, కూన భోనోజీరావు, తంగి గురయ్య, కూన రాము, నాగళ్ల మురళీధర్, రాడ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 15 వైసీపీ కుటుంబాలు



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న కలమట వెంకటరమణ

ఎల్ఎన్ పేట: కరకవలస గ్రామ పంచాయతీ కవిటి గ్రామానికి చెందిన కె.దామోదరరావు, ఎస్.నరసింహారావు, ఎం.రాములు, కె.ఆదినారాయణతోపాటు మరో 11 కుటుంబాలు వైసీపీని వీడి ఆదివారం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పరిపాలనా విధానాలపై విరక్తి చెందిన ప్రజలు ఆయనను గద్దె దించేందుకు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారన్నారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పి.రాజారావు, పి. సింహాచలం, చిన్నవాడు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కళా వెంకటరావు

ఎచ్చెర్ల: వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, జగన్ రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీకి ప్రజా కోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికలకు సిద్ధమని ప్రకటించిన వైసీపీని.. ఓడించేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జగన్‌ను గద్దెదింపేందుకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల అనంతరం వైసీపీ జెండా కనుమరుగవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపు తథ్యమని చెప్పారు. ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్ట్‌ను కూడా పూర్తిచేయలేదని విమర్శించారు. రోజుకో రకం కొత్త పన్నులతో ప్రజలను జలగలా పీల్చారన్నారు. రాష్ట్రంలో వైసీపీ బాధితులే టీడీపీకి స్టార్ క్యాంపైనర్లని తెలిపారు. ఒకప్పుడు రూ.200 ఉన్న విద్యుత్ బిల్లులు నేడు రూ.1,000 చేరిందన్నారు. వైసీపీ అసమర్థత పాలనతో రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందన్నారు. మద్యం, నిత్యావసర ధరలు, ఆర్టీసీ చార్జీలను పెంచి ప్రజలను ఇబ్బంది పాల్జేసిన ఘనత వైసీపీదేనన న్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు నేరుగా డబ్బులు చేరుతున్నందునే వైన్‌షాపుల్లో ఆన్‌లైన్ చెల్లింపులు లేవన్నారు. మద్యం నిషేధించి ఎన్నికలకు వెళతానని గత ఎన్నికల్లో ప్రకటించిన జగన్‌రెడ్డి.. ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వెళతారని ప్రశ్నించారు.

వైసీపీని వీడి టీడీపీలోకి..

పాతపట్నం: గంగువాడ పంచాయతీ పేడూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి ఆదివారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ పార్టీ కండువా లను వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యపరిరక్షణకు టీడీపీ విజయం అనివార్యమన్నారు. జన్ని కాంతారావు, సిద్దమణుగు నీలయ్య, కన్నయ్యపేట పోలయ్య, హరిపురం రాము, గొట్టిపల్లి పోలయ్య తదితరులు పార్టీ మండల అధ్యక్షుడు పైల లక్ష్మయ్య, మిరియాబిల్లి బాబూరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్

రైలుకింద పడి ఒకరి మృతి

పలాస: పలాస పరిధి పలాస-పూండి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రైలుకింద పడి 30 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతుడు ఏ రైలునుంచి జారిపడ్డాడో వివరాలు సేకరిస్తున్నామని, అయనకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



నుజ్జయిన ఆటో.. నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బూర్జ: డొంకలపర్త కూడలి సమీపంలో ఆదివారం విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొంది. వీరఘట్టం మండలం కెల్ల నుంచి ఆటోలో శ్రీకాకుళం వైపు అరటి గెలలు తీసుకుని వెళ్తుండగా లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఇదే సమయంలో అటువైపుగా వస్తున్న ఆటోపై స్తంభం పడింది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. అయితే ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బెలమంలో మెగా వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు సురేష్

ఆమదాలవలస: బెలమం గ్రామంలో శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ వైద్యులు బొడ్డేపల్లి సురేష్ ఆధ్వ ర్యంలో ఆదివారం ఉ చిత వైద్యశిబిరం నిర్వ హించారు. రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను అందజే శారు. చలికాలంలో గుండె నరాలు ముడు చుకుపోవడం వల్ల ఎక్కువగా గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తు లకు వివరించారు. ప్రతిఒక్కరు గోరువెచ్చని నీటిని తాగాలని.. సకాలంలో మందులు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామస్థులు, గ్రామపెద్దలు ఆయన్ని అభినందించారు.

ఆదిత్యుని ఆదాయం రూ.3లక్షలు



విజయవాడ డీఆర్వోకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం రూ.3,08,294 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.94,300, విరాళాల ద్వారా రూ.71,994, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,42,000 లభించాయని ఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు. కాగా స్వామివారిని ఎన్టీఆర్ విజయవాడ జిల్లా డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ వారికి అందజేశారు.

అమ్మో.. సీఎస్పీ రోడ్డు

- తరచూ ప్రమాదాలు
- భయాందోళన చెందుతున్న ప్రయాణికులు



అధ్వానంగా ఉన్న సీఎస్పీ రహదారి

ఆమదాలవలస: శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస మధ్యలో ఉన్న సీఎస్పీ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణానికి అవస్థలుతప్పడంలేదు. అడుగడుగునా గోతులమయం కావడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలో ఆరో వార్డు సనపలవానిపేట వద్ద ద్విచక్రవాహనం నడుపుతూ ఓ వ్యక్తి గుంతలో పడిగాయాలపాలయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో చికిత్సనిమిత్తం శ్రీకాకుళం తరలించారు. శ్రీకాకుళం కొత్తరోడ్డు నుంచి ఆమదాలవలస వంతెన వరకు ఉన్న రహదారి భారీ గుంతలను కనీసం అధికారులు మట్టితోనైనా చదును చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని పలువురు చెబుతున్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం సొంత నియోజకవర్గాల పరిధిలో ఉన్న సీఎస్పీ రహదారిని తక్షణమే అభివృద్ధి చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.



క్షతగాత్రుడి చుట్టూ గుమిగూడిన స్థానికులు

రేపు తేలుకుంచిలో సమాశ్రయణ దీక్ష

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో మంగళవారం త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో సమాశ్రయణ దీక్ష (గురుదీక్ష) కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సుదర్శన హవనం యజ్ఞం, తీర్థగోష్ఠి, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

కంచిలి: కంచిలి మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఆసరా కార్యక్రమం చెక్కులను ఆదివారం పంపిణీచేశారు. కార్య క్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పేరాడ తిలక్, పిరియా సాయిరాజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో ఇటీవల తల్లి మరణిం చడం, తండ్రి కూడా అందుబాటులో లేకపోవడంతో అనా థలుగా మిగిలిన చిన్నారులు శరణ్య, లిఖితలకు ఆదివారం అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు రూ. 17 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా తులసమ్మ సంబరం



ఘటాలతో ఊరేగింపుగా మహిళలు

ఇచ్ఛాపురం: దనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని బెల్లుపడ కాలనీ వాసులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాలనీ నుంచి అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు.

ఎట్టకేలకు గోతులు పూడ్చివేత



గోతులు పూడ్చిన దృశ్యం

నందిగాం: జాతీయరహదారి నుంచి పాలవలసకు వెళ్లే గ్రావెల్ మార్గానికి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. గోతులమయం కావడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై అనేక పర్యాయాలు కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. నరేంద్రపురం సర్పంచ్ బోకర సన్యాసిరావు నేతృత్వంలో రోడ్డు గోతులు పూడ్చే పనులను చేపట్టారు.

బెంతు ఒరియాలు నిరసన



నిరసన తెలుపుతున్న బెంతుఒరియా ప్రతినిధులు

కవిటి: కవిటిలో మంత్రి ఎస్.అప్పలరాజు తమపై చూపు తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బెంతు ఒరియాలు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనులు కలిసి నకిలీ బెంతు ఒరియాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన తెలియజేస్తే బాధ్యతాయుతమైన మంత్రి వారికి సంఘీభావం తెలియజేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి పలాస నియోజకవర్గంలో పర్య టించిన సమయంలో బెంతుఒరియాలపై అధ్యయనానికి కమిషన్ వేస్తున్నామని ప్రకటించినప్పుడు పక్కన ఉన్న మంత్రి అప్పలరాజు హర్షధ్వానాలు తెలిపారన్నారు. అటువంటి పరిస్థితిలో కనీసం కుల ధ్రువీకరణకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మా కులస్థులకు న్యాయం చేస్తామని చెప్పే పరిస్థితి లేకపోవడం దారుణ మన్నారు.నకిలీ ధ్రువపత్రాలు పొందిన వారిపై పోరాటంచేయాలి తప్ప గిరిజనులుగా ఉన్న మా మధ్య చీలిక తెచ్చి లబ్ధిపొందాలని మంత్రి యత్నించడం తగ దన్నారు. మంత్రి తీరుకు నిరసనగా కవిటి బస్టాండులో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. 32వ రోజు దీక్షలో కొక్కొలిపుట్టుగ గ్రామస్థులు కూర్చొన్నారు. కార్యక్రమంలో రజనీకుమార్ దొళాయి, సుమన్‌బిసాయి, భగవాన్ బిసాయి, దుదిష్టిమజ్జి, శ్రీరామ్‌బిసాయి, జాదవ్ సాహు పాల్గొన్నారు.

అంపురంలో భవిష్యత్‌కు గ్యారెంటీ



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

కంచిలి: అంపురంలో టీడీపీ నాయకులు బాబు ష్యూరి టీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదిన రామారావు, పొల్లయ్య, గజేంద్ర పాల్గొన్నారు.

తెలగలను బీసీల్లో చేర్చేవరకూ ఉద్యమం



సంఘ నేతలతో ఐక్య నినాదం చేస్తున్న వెంకట రామారావు

ఇచ్ఛాపురం: తెలగ కులస్థులను బీసీలో చేర్చే వరకూ ఉద్యమం ఆగదని ఉత్తరాంధ్ర తెలగకుల నాయకుడు పల్లంట్ల వెంకట రామారావు తెలిపారు. పోరాటంలో భాగంగా ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు తెలగ జాతి ఆత్మగౌరవ ఉత్తరాంధ్ర పాదయాత్రకు శ్రీకారం చుట్టామని చెప్పారు.ఈమేరకు ఆదివారం ఇచ్ఛాపురంలో ఆయనకు తెలగ కులస్థులు ఘనస్వాగతం పలికారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వేచ్ఛానగర్ వీధిలో ఉత్తరాంధ్రజిల్లాల నుంచి వచ్చిన తెలగ జాతి కులస్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర నాయకులు అల్లాడ శ్రీనివాసరావు, మంగం శ్రీనివాసరావు, నాయకులు డీసెట్టిగాలి బంద్, లక్ష్మీనారాయణ, పల్లంటి మధుమూర్తి, కట్టా సూర్యప్రకాష్, ఎం.శ్రీను, విజయ్‌కుమార్, జయప్రకాష్, ఎం.రాంబాబు, పి.చిరంజీవి పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియులకు సముచితస్థానం కల్పించాలి



మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్

సోంపేట: వచ్చేసార్వత్రిక ఎన్నికల్లో అగ్నికుల క్షత్రి యులకు సముచిత స్థానం కల్పించే పార్టీకి అండగా ఉంటామని అగ్నికుల క్షత్రియ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బి.ప్రసాద్ తెలిపారు. ఆదివారం బారువలో రెయ్యి కోదండ కృష్ణ ఆధ్వర్యంలో అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెండు తెలుగురాష్ట్రాలకు చెందిన సంఘ ప్రతినిధులు గొరకల వసంత్, పులకల శ్రీరాములు, పీవీ రావ్, తిరుమన్న నాగరాజు, అవనిగడ్డ నాగయ్య, ఎం.నాగ రాజు, జుత్తు నీలకంఠం పాల్గొన్నారు.

చెత్తకు పొగ.. ప్రజల ఉక్కిరిబిక్కిరి

- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని యంత్రాంగం

ఆమదాలవలస: మున్సిపాలిటీ చెత్త పొగతో 208 మంది విద్యార్థులు ప్రతిరోజూ ఉక్కిరిబిక్కిరి అవుతూ దినదినగండంగా చదువులు సాగిస్తు న్నారు. వివరాల్లోకి వెళితే మున్సిపాలిటీ పరిధిలోని జగ్గుశాస్త్రులపేట, తాళ్లవ లసల్లో ఆమదాలవలస మున్సిపల్ డంపింగ్‌యార్డు ఉంది. ఈ డంపింగ్ యార్డుకు ప్రతిరోజూ మున్సిపాల్ పారిశుధ్య కార్మికులు పట్టణంలోని 23 వార్డుల్లో సేకరించిన చెత్తను తరలిస్తుంటారు. అయితే ఇక్కడికి తరలించిన చెత్తను తడిచెత్త, పొడిచెత్తగా వేరు చేయకుండా ఏకంగా ఒకే చోట పడవేసి నిప్పు పెడుతున్నారు. దీంతో వివిధ రసాయన పదార్థాల నుంచి వెలువడే పొగ పరిసర ప్రాంతాలను కమ్మేస్తోంది. దీంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. దీనికి తోడు డంపింగ్‌యార్డు పక్కనే ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యమూ ఈ పొగ పీల్చడం వల్ల పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయానికి గండి

తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువుగా తయారు చేసి రైతులతో పండ్లు, కూరగాయల పంటలు, పూల మొక్కల సాగు చేసే వ్యక్తులకు అందించడం ద్వారా మరికొంత ఆదాయాన్ని మున్సిపల్ కార్యాలయానికి రాబట్టవచ్చు. ఇలా ఏమీ కాకుండా ఒకే ప్రాంతంలో రోజు మొత్తం చెత్తను వేసి అగ్గి పెట్టడంతో పరిసర గ్రామాలతోపాటు విద్యార్థినులు వెలువడుతున్న రసాయన పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు కనీసం స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎవరో తెలియని వ్యక్తులు అగ్గి పెడుతున్నారని, అక్కడ ఒక మనిషిని నియమించాం.. పూర్తిస్థాయిలో అగ్గి మంటలను నివారించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చెత్త కాలుతూ వెదజల్లుతున్న పొగ →

